

మురుగుకాల్వ ఆధునికీకరించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పసలదీవి గ్రామంలో ఉన్న వెస్ట్ కుక్కిలేరులో మురుగుకాల్వను ఆధునికీకరించాలని రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మురుగుకాలువ పూడుకుపోవడం వల్ల పంట పొలాల్లో ముంపు నీరు లాగడం లేదన్నారు. ఈ కారణంగా వందలాది ఎకరాల్లో పంట సాగు చేయడం లేదన్నారు. గతంలో అనేకమార్లు అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఏళ్లతరబడి కాలువ పూడికతీత పనులను చేపట్టకపోవడంతో పొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వ పూడికతీత పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టు సత్యనారాయణ, పులపర్తి శ్రీను, కొట్టు వెంకట్రావు, లక్ష్మినారాయణ, సర్వేశ్వరరావు, జానకీరామ్, ఏసురాజు, కందులపాటి శ్రీనివాస్, శివనందన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తేనా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

రెండు జిల్లాల్లో ప్రజలను వెంటాడుతున్న సమస్యలు అనేకం

రోడ్ల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థం

పోలవరం నిర్వాసితుల పరిస్థితి అత్యంత దుర్భరం

ఆక్వా, మొక్కజొన్న, కోకో రైతుల సమస్యలపై ప్రశ్నించేనా

భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై చర్చ సాగేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ స్థానాల నుంచి కూటమి ఎంఎల్ఏలే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు వంటి అనేక సమస్యలు ఇక్కడి ప్రజానీకాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఏలు తమ నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు లేవనెత్తాలని అంతా కోరుతున్నారు. రెండు జిల్లాలో రాష్ట్ర, మీడియం రహదారులు దాదాపు మూడు వేల కిలోమీటర్లకుపైగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రోడ్లు మొత్తం అస్తవ్యస్థంగా మారాయి. ఏలూరు-జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం రోడ్డు, ఏలూరులో కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే వంగాయగూడెం రోడ్డు, టి.నరసాపురం-జీలుగుమిల్లి రోడ్డు, వీరవాసరం-బ్రాహ్మణచెర్వు, వెంప-మొగల్తూరు రోడ్లు ఇలా రెండు జిల్లాల్లోనూ రోడ్లన్నీ గోతులమయంగా మారి వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ.196.55 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు సైతం రూపొందించారు. పశ్చిమలోనూ అదేవిధమైన పరిస్థితి ఉంది. వైసిపి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి గురించి తీవ్ర విమర్శలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు రోడ్ల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు



వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని రోడ్ల సమస్యపై అసెంబ్లీలో ఎంఎల్ఏలు లేవనెత్తాలని ప్రజలు కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 20 వేల నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి ఇప్పటికీ పరిహారం అందలేదు. 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి గడిచిన మే నెలకు తరలిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, కాలనీల నిర్మాణం ఏఒక్కటీ చేయని పరిస్థితి ఉంది. దీంతో ఈ ఏడాది మూడు, నాలుగుసార్లు గోదావరి వరద విరుచుకుపడటంతో నిర్వాసితులంతా కంటిమీద కునుకు లేకుండా గడపాల్సి వచ్చింది. తమ సమస్యలపై స్థానిక ఎంఎల్ఎ అసెంబ్లీలో మాట్లాడాలని నిర్వాసితులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

నలిగిపోతున్న జిల్లా రైతాంగం..

జిల్లాలోని ప్రధాన పంటలైన ఆక్వా రైతులు ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. ధరలు పడిపోయాయి. మేత ధర అందనంత ఎత్తుకు ఎగబాకింది. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.లక్షల్లో బిల్లులు బాదేస్తున్నారు. వైరస్ విజృంభించి ఆక్వా అంతా తుడిచిపెట్టుకుపోతుంది. ఫలితంగా ఆక్వా రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. అసెంబ్లీలో ఆక్వా రైతుల సమస్యలను ఎంఎల్ఏలు లేవనెత్తాలని అంతా కోరుతున్నారు. అక్టోబర్ నుంచి మొక్కజొన్న సాగు మొదలుకానుంది. జిల్లాలో లక్షకుపైగా ఎకరాల్లో ఈ సాగు ఉంది. మొక్కసీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ సరఫరా చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇస్తున్న నాసిరకం సీడ్స్‌తో రైతులు ప్రతియేటా తీవ్రంగా నష్టపోతున్నారు. సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై అసెంబ్లీలో లేవనెత్తితేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కోకో రైతులు ధరలేక తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇకనుంచి అటువంటి పరిస్థితి లేకుండా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో జిల్లాలోనే అత్యధికంగా దాదాపు 40వేల ఎకరాల్లో కోకో సాగు సాగుతోంది. కోకో రైతుల సమస్య పరిష్కారానికి ఎంఎల్ఏలు అసెంబ్లీలో లేవనెత్తాలని కోకో రైతులు కోరుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రైతుల గురించి మాట్లాడతారా?

తెలంగాణ నుంచి దేవరపల్లి వరకూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీసు రోడ్లు నిర్మించకపోవడంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలని కొన్ని నెలలుగా స్థానిక రైతాంగం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. అధికారులు చెబుతున్న మాటలు ఏమాత్రం ఆమోదయోగ్యంగా ఉండటం లేదు. గ్రీన్‌ఫీల్డ్ రైతుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై మాట్లాడేనా..

విభజిత పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో నూతన కలెక్టరేట్ నిర్మాణంపై రాజకీయ దుమారం రేగుతోంది. కలెక్టరేట్ నిర్మాణం ఉండి నియోజకవర్గ పరిధిలో నిర్మించాలని ఒకపక్క, భీమవరం పట్టణంలో నిర్మించాలని మరోపక్క తీవ్ర వాగ్వివాదాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. దీంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణం సమస్యపై అసెంబ్లీలో స్పష్టత ఇవ్వాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు, డ్రెయినేజీ, టిడ్కో ఇళ్లు వంటి అనేక సమస్యలతో జనం సతమతం

డెల్టాలో తాగునీరు పూర్తిగా దెబ్బతింది. ఆక్వా సాగుతో తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీరు అందిస్తామని మాటలు చెప్పడం తప్ప చర్యలు లేకుండా పోయాయి. ఏలూరు జిల్లాలోనూ పరిస్థితి అదేవిధంగా ఉంది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకుండాపోయింది. టిడ్కో ఇళ్లు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ పట్టించుకోని పరిస్థితి. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎటువంటి సాయమూ అందడం లేదు. గత టిడిపి ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇళ్లకు పరిహారం మాటలకే పరిమితమైంది. పింఛన్ల ఏరివేతపైనా తీవ్ర అలజడి నెలకొంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ఎంఎల్ఏలు తమ గళం వినిపించినప్పుడే పరిష్కారం దొరుకుతుంది.

నేడు జిల్లాకు రణభేరి

500 మోటార్ సైకిళ్ల ర్యాలీతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో సభలు ఏర్పాటు

దారి పొడవునా వినతులు అందుకోనున్న నేతలు

రణభేరి యాత్రను విజయవంతం చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం



మాట్లాడుతున్న యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారీ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడంతోపాటు ఉపాధ్యాయులను బోధన చేయనీయకుండా బోధనేతర పనులు అప్పగించి పని భారాన్ని పెంచడం పరిపాటైంది. దీనికితోడు చాలాకాలంగా వెంటాడుతున్న సమస్యలే కాకుండా ప్రభుత్వ విధానాల ఫలితంగా వస్తున్న మరిన్ని సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధన చేస్తూనే మరోపక్క సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమ బాట పట్టారు. బోధనేతర పనులు తగ్గించి, బోధనకు అవకాశం కల్పించాలని, ఉపాధ్యాయులకు డిఎ బకాయిలు, పొదుపు సొమ్ము నుంచి నగదు ఉపసంహరణలు, బకాయిలు చెల్లించాలని, పిఆర్‌సి కమిషన్ వేసి వెంటనే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ రణభేరి పేరిట మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభించింది. దీనిలో భాగంగా రణభేరి మోటార్ సైకిల్ యాత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వెల్లడించారు. యాత్ర గురువారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి సిద్ధాంతం వద్ద మన జిల్లాలోకి ప్రవేశించనుంది. సుమారు 500 మోటార్ సైకిళ్లతో ఉపాధ్యాయులు రణభేరి యాత్రకు స్వాగతం పలకనున్నారు. సిద్ధాంతం నుండి పెనుగొండ, మార్టేరు, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం, పిప్పర, పెంటపాడు మీదుగా సాయంత్రానికి తాడేపల్లిగూడెం యాత్ర చేరుకుంటుంది. అదే రోజు రాత్రికి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. రణభేరి దళ నాయకులుగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, అరుణకుమారి, జ్యోతిబసు, సుభాషిణి వ్యవహరిస్తున్నారు. భీమవరం, పాలకొల్లులో నిర్వహించే సభల్లో వారు ప్రసంగించనున్నారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై దారి పొడవునా వినతిపత్రాలు దళ నాయకులు తీసుకోనున్నారు. ఈ నెల 24వ తేదీలోపు తమ డిమాండ్లు పరిష్కరించాలని రణభేరి ప్రచార యాత్ర కోరుతోంది. 25న అమరావతిలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు ఉపాధ్యాయులు వేల సంఖ్యలో తరలొచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

వీరవాసరం-బ్రాహ్మణచెర్వు రోడ్డు నిర్మించాలని రాస్తారోకో



నవుడూరు వద్ద ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెద్దపెద్ద గోతులతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన ఆర్అండ్‌బి రహదారిని తక్షణం నిర్మించాలని కోరుతూ పొలమూరు శివారు నవుడూరు జంక్షన్ వద్ద బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ గోతుల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, తక్షణమే ఆర్అండ్‌బి రహదారికి మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి పెద్దపెద్ద గోతులతో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి ఆర్అండ్‌బి రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించాలని కోరారు. వర్షం వచ్చినప్పుడు గోతులు ఎక్కడున్నాయో తెలియక రాకపోకలు సాగించడం అసాధ్యంగా మారిందని తెలిపారు. ఈ ఆందోళనకు ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు సైతం సంఘీభావం తెలిపి పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, వివిధ పార్టీల నేతలు చింతపల్లి గురు ప్రసాద్, మేనేడి సత్యనారాయణ, కొట్టాల మధు, తూటే సురేష్, రాపాక ఆశీర్వాదం, తాడిపత్రి నరేంద్ర, పిల్లి రాజకుమార్, పిల్లి శ్రీనివాస్, చిక్కాల సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు నాయకత్వం వహించారు.

తల్లి ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం

'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - ఆకివీడు

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని, మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. బుధవారం ఆకివీడు సిహెచ్‌సిలో ఈ కార్యక్రమాన్ని ఆయన డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లి అనారోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ముందుకుపోయే పరిస్థితి ఉండదన్నారు. ఆరోగ్యవంతమైన స్త్రీ దేశానికి అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కుటుంబంలో మహిళ బాగుంటే ఆ కుటుంబం అంతా బాగుంటుందనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలకు, ఆడపిల్లలకు 14 అంశాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో 15 రోజులపాటు వైద్య శిబిరాలను నిర్వహిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 471 ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. తొలుత 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి రాష్ట్రీయ పోషణ మాసం ప్రతిజ్ఞను అందరితో చేయించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ జి.గీతాబాయి, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ఎన్‌టిఆర్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, హాస్పటల్ సూపరింటెండెంట్ గీతభవాని, డాక్టర్ బిలాల్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఐయినంపూడి శ్రీదేవి, జెఎస్‌పి ప్రతినిధి జుత్తిగ నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిరసిస్తూ 20న రౌండ్‌టేబుల్ సమావేశం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేటుపరం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ప్రయివేటీకరించడం లేదని, పి4కి అప్పగిస్తున్నామని ప్రభుత్వం అడ్డగోలుగా వాదిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని దగ్గులూరులో మెడికల్ కళాశాల పనులు పునాదుల వరకూ పూరయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాని నిర్మాణం కొనసాగించకపోవడంతో నిలిచిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని సిపిఎం కోరుతుందని తెలిపారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..!

ఈ కింది ఫొటోలు చూస్తే జిల్లాలో రోడ్లు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుంది. వర్షం వస్తే గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించలేక వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. ముఖ్యమంత్రి రోడ్లపై గుంతలు పూడ్చాలని ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పనులు చేపట్టని పరిస్థితి. దీంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కష్టాలు ఇంకెన్నాళ్లూ అని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో రోడ్ల దుస్థితిపై ప్రజాశక్తి ప్రత్యేక ఫోకస్..

- కార్యాచరణకు నోచని సిఎం ప్రకటనలు
- మెరుగుపడని రహదారి వ్యవస్థ
- జనాలకు తప్పని వ్యథ

చుట్టూ ప్రముఖులే.. రోడ్డేమో అత్యంత అధ్వానం.. ★ ★ ★


అత్యంత అధ్వానంగా పొలమూరు-నవుడూరు రోడ్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిత్యం ఆ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భీమవరం నుంచి రావులపాలెం, రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లేవారికి దగ్గరి మార్గం. ప్రతి అరగంటకు ఒక బస్సు తిరిగే ప్రధాన రహదారి. అయితే వీరవాసరం-బ్రహ్మణచెర్వు మధ్య రోడ్లన్నీ గుంతలతో నిండి ఉంది. ఇక నవుడూరు జంక్షన్‌లో పరిస్థితి అయితే పర్లాంగు దూరమైనా బురద జల్లించుకోకుండా, కింద పడకుండా ప్రయాణించడం వాహనదారులకు కత్తిమీద సాములా మారింది. అదే నవుడూరు జంక్షన్‌లో వైసిపి ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ ఉన్నా, ఇటు భీమవరం ఎంఎల్ఏగా అంజిబాబు పిఎసి ఛైర్మన్‌గా ఉన్నా, అటు ఆచంట ఎంఎల్ఏగా మాజీ మంత్రి పితాని ఉన్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని పరిసర గ్రామాల ప్రజలు లబోదిబోమంటున్నారు.

ముందు గొయ్యి.. చూసి అడుగెయ్యి..!


ఆచంట - కొటాలపర్రు వంతెనపై రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో మార్టేరు నుంచి కోడేరు ప్రధాన రహదారి, కొడమంచిలి వయా వల్లూరు ఆర్అండ్‌బి రహదారులపై భారీ గోతులు పడ్డాయి. మండలంలోకి ప్రవేశించగానే కొతాలపర్రు వంతెన వద్ద భారీ గొయ్యి స్వాగతం పలుకుతుంది. ఈ రహదారిపై పలువురు యువకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కూటమి అధికారంలోకొచ్చాక గోతులు పూడ్చినా అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆచంట-పాలకొల్లు ఆర్అండ్‌బి రహదారీ అధ్వానంగా మారింది. కగోరుమిల్లు మలుపు వద్ద రహదారి మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారింది.

విజయవాడ వెళ్లాలంటే వణుకే.. ★ ★ ★


అధ్వానంగా ఉన్న జువ్వలపాలెం జాతీయ రహదారి

ప్రజాశక్తి - కాళ్ల

అది భీమవరం నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి. వందల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగించడంతోపాటు ప్రముఖులు సైతం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. అయితే రోడ్డంతా అధ్వనంగా మారగా జువ్వలపాలెంలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఈ గోతులు దాటడం అంటే వాహనదారులకు పెద్దపరీక్షగా ఉంటుంది. ఏలూరుపాడు నుంచి పెదఅమిరం వరకు జువ్వలపాలెం రహదారి వర్షాలతో బురదమయమైంది. ఈ రోడ్డు పరిస్థితిని పరిశీలించి అధికారులు తక్షణమే స్పందించి కనీస మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తూతూమంత్రపు మరమ్మతులు.. జనానికి తిప్పలు


ఛిద్రంగా మారిన ఉండి గణపవరం రహదారి

ప్రజాశక్తి - ఉండి

తూతూమంత్రపు మరమ్మతులతో నాణ్యత లేక రోడ్లన్నీ అస్యవ్యస్థంగా ఉన్నాయని, లక్షలు వెచ్చించినా రోడ్లు బాగుపడని దుస్థితి కన్పిస్తోందని మండలంలోని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి నిదర్శనం ఉండి-గణపవరం రాష్ట్రీయ రహదారి. ఈ రహదారి పునర్నిర్మాణంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న గోతులు.. ★ ★ ★


అధ్వానంగా పిప్పర వెళ్లే రహదారి

ప్రజాశక్తి - గణపవరం

అవేమీ చిన్నపాటి చెరువులు కాదు.. అది గణపవరం నుంచి పిప్పర వెళ్లే రహదారి. ఆ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు గోతులను తప్పించలేక, గోతులను గుర్తించలేక నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. గణపవరం నుండి జల్లికొమ్మర, పిప్పర నుంచి భీమవరం, పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారులు సైతం గోతులమయంగా మారాయి. వర్షాలకు ఈ రోడ్లు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.

ఒళ్లు హూనమే.. ★ ★ ★


అధ్వానంగా ఉన్న మొగల్తూరు వెంప - రహదారి

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లా కేంద్రం భీమవరం వెళ్లాలంటే ఒళ్లు హూనం కావాల్సిందే. మొగల్తూరు నుండి వెంప మీదుగా భీమవరం వెళ్లాలన్నా, శేరేపాలెం, కొప్పర్రు మీదుగా వెళ్లాలన్నా, కాళీపట్నం మీదుగా భీమవరం వెళ్లలన్నా మూడు మార్గాలు ధ్వంసమై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలు, ఉద్యోగులు, అధికారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.



కొత్తపల్లి సుబ్బారాయుడు, బందారు మాధవ నాయుడును సన్మానిస్తున్న దృశ్యం

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారథి

ప్రజాశక్తి - నరసాపురం

సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారథి అన్నారు. బుధవారం లక్ష్మణేశ్వరం సొసైటీ అధ్యక్షుడిగా చాగంటి పార్థసారథి బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు సభ్యులుగా దొంగ రామలక్ష్మి, గుండుబోయిన వెంకటేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు. పాలక వర్గ సభ్యులతో సొసైటీ కార్యదర్శి ముదునూరి సత్యనారాయణ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, విత్తనాలు, ఎరువులు, రుణాలు మంజూరు చేయడంలో కృషి చేస్తానన్నారు. అనంతరం పార్థసారధిని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బందారు మాధవనాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌చే ప్రభుత్వ స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఉండి మెయిన్ సెంటర్లోని ఆర్‌అండ్‌బి బంగ్లా, ఇరిగేషన్ కార్యాలయం, డ్రైనేజీ శాఖ, దేవాదాయ శాఖ స్థలాలు, జిల్లా పరిషత్ స్థలాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన సర్వే పూర్తిస్థాయిలో పారదర్శకంగా చేసి సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు ప్రభుత్వ స్థలాల్లో ఏమైనా ఆక్రమణలు ఉంటే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎండోమెంట్, ఇరిగేషన్ స్థలానికి మధ్య ఉన్న ప్రభుత్వ భూమి, జిరాయతీ భూమా అని ఆరాతీసి, వాటి సంగతి తేల్చాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ నాగార్జున, మండల సర్వేయర్ రత్నావతి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ సర్టిఫికెట్ తప్పనిసరి

జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు

ప్రజాశక్తి - ఆచంట

రేషన్ దుకాణాల నిర్వాహకులు విధిగా తమ దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ సర్టిఫికెట్లు ప్రదర్శించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు అన్నారు. బుధవారం ఆచంటలో పలు రేషన్ షాపులను తనిఖీ చేసి కాటాలకు సీళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ రేషన్ డీలర్లు కాటా యంత్రాన్ని ఐదు కేజీల రాయితో సరిచూసుకుని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.కనకరాజు, సిబ్బంది ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బిచర్ల డ్రెయిన్‌లో మట్టి తొలగింపు

ప్రజాశక్తి - నరసాపురం

ఎల్‌బి.చర్ల గ్రామంలో బుధవారం ఎల్‌బి.చర్ల - దర్బరేవు డ్రెయిన్‌లో మట్టి తొలగింపు పనులను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ఈ పనుల ద్వారా గ్రామంలో నీటి నిల్వలు తగ్గి, వ్యవసాయ భూములకు నీరు సకాలంలో చేరుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ఛైర్మన్ గుబ్బల మారాజు, ఎఎంసి వైస్ ఛైర్మన్ దేశిరెడ్డి గంగాధర్, కటకంశెట్టి సంజీవరావు, ఫణికర్ పాల్గొన్నారు.

19న ఛాంబర్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

పాలకొల్లు:ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 19 ఉదయం 9 గంటలకు అరిస్టోక్రాట్ లాబొరేటరీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, 18 నుండి 25 ఏళ్ల వయసు గల మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని కళాశాల ఛైర్మన్ కెవి.నరసింహారావు తెలిపారు. ఫార్మాస్యూటికల్ కళాశాల 'ప్లేస్మెంట్'లో ముందుంటున్నారు. దానిలో భాగంగా 19న అరిస్టోక్రాట్ ల్యాబ్‌లో ఉద్యోగుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల సెక్రటరీ కెవి.సీతారామారావు కోరారు. ఇంటర్, ఐటిఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.18,000 నుంచి రూ.20,000 వరకూ జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, వివరాలకు 9912046234, 9849712739 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సిద్ధాంతం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఛైర్మన్ కౌరు శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్



మండలంలోని సిద్ధాంతం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సొసైటీ ఛైర్మన్ కౌరు శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, రాష్ట్ర యువ నాయకులు పితాని వెంకట్ తనపై ఉంచిన నమ్మకానికి తగినట్టు గ్రామాభివృద్ధికి, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సొసైటీ పరిధిలో ఉన్న సభ్యులు సుమారు 500 వరకు ఉన్నారని, ఈ సంఖ్యను మరింతగా పెంచాలని రైతులకు సొసైటీ పై నమ్మకం కలిగేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్నప వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్యనారాయణ రాజు సేవలు వెలకట్టలేనివి

కాళ్ల:కోలనపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధిలో మాజీ సర్పంచి వేగిరాజు సత్యనారాయణ రాజు సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం కోలనపల్లి గ్రామ పంచాయతీలో ప్రధాని మోడీ జన్మదిన వేడుక సందర్భంగా సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మాజీ సర్పంచి వేగిరాజు సత్యనారాయణరాజుకు నూతన వస్త్రాలు, పండ్లు, స్వీట్లు అందించి సత్కరించారు. వేగిరాజు సత్యనారాయణరాజు ఏడున్నర సంవత్సరాలపాటు సర్పంచిగా సేవలందించి గ్రామంలో తాగునీరు, ఓవర్ హెడ్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్స్, పైపులైన్, రోడ్లు వంటి పనులు చేశారని తెలిపారు. వేగిరాజు గాంధీరాజు, వేగేశ్న వెంకట నరసింహరాజు, డాక్టర్ వేగేశ్న రామకృష్ణంరాజు, వేగిరాజు సోమరాజు, వేగిరాజు రామచంద్రరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో నాలుగో విడత కౌన్సెలింగ్

ఆచంట: ఆచంటలోని ఐటిఐలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 4వ విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ వెబ్‌సైట్ site-iti.ap.gov.in ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ ఐవి సత్యనారాయణ రాజు బుధవారం విలేకరులకు తెలిపారు. ఇక్కడ చేరదలచిన విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను స్వయంగా ఈ నెల 27వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రభుత్వ ఐటిఐ ఆచంట కాలేజీలో అందించాలని తెలిపారు. 29న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490111002కు సంప్రదించాలని తెలిపారు.

మల్లవరంలో 'పొలం పిలుస్తోంది'

నరసాపురం:మల్లవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మల్లవరం సర్పంచి గొట్టుముక్కల సుజాత అధ్యక్షతన సహాయ వ్యవసాయ సంచాలకులు, పివివి ఎన్ఎస్‌పి.ప్రసాద్ ఎరువుల యాజమాన్యం, నానో యూరియా నానో డిఎపి ఆవశ్యకతను వివరించారు. మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషి మాట్లాడుతూ ఈ నెల 18న ప్రతి గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడైలిన్ 0.25 సీబీ మందు, గ్రామ పంచాయతీ వారి సహకారంతో నూకలు, నూనె కల్పించిన విషపు ఎర మండల రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

కాళ్ల:పేకాట స్థావరంపై దాడిచేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. పెదఅమిరంలోని రొయ్యల షెడ్డులో పేకాటాడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.92,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు గాయాలు

కాళ్ల: పెదఅమిరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెదఅమిరానికి చెందిన భార్యాభర్తలు గండి ఆనందరావు, శాంతకుమారి (59) ప్రధాన రోడ్డు గుండా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సమయంలో వారిని లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతకుమారి అక్కడికక్కడే మృతి చెందారు. ఆనందరావుకు గాయాలయ్యాయి. ఆయన ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి సమర శీల పోరాటాలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమర శీల పోరాటాలు నిర్వహించడమే సీతారాం ఏచూరి, ఆర్‌ఎన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. సిపిఎం వీరవాసరం మండల విస్తృత సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో తాళ్లూరి రాము అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నరసింహమూర్తి, సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ప్రధాన రోడ్ల గోతుల



ఏచూరికి, ఆర్ఎన్‌కు జోహార్లు అర్పిస్తున్న నేతలు

కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీరు కలుషితం కావడం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడ్డారన్నారు. మండల కార్యదర్శి బొర్రా అలమాహారాజు మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ భారాలు మోయలేక చస్తుంటే స్మార్ట్ మీటర్ల పేరుతో మరింత భారాన్ని వేయాలని చూస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముందుగా సీతారాం ఏచూరి, ఆర్ఎన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, ఏళ్ల బండి నారాయణమూర్తి, జుత్తిగ సాంబయ్యమ్మ, కిలాడి సత్యనారాయణ, పాలా కోటేశ్వరరావు, రెడ్డి రామారావు, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

మంచి కళాకారుడిని కోల్పోయాం

ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలీ

ప్రజాశక్తి - ఆచంట

కళారంగంలో కళాకారుడిని కోల్పోవడం బాధాకరమని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.వలీ అన్నారు. చిన్నమల్లంలో బుధవారం సిపిఎం నాయకులు, డప్పు కళాకారుడు కొండేటి రాఘవులు సంస్మరణ సభ పెనుమంచిలి గ్రామ శాఖ కార్యదర్శి సిర్రా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా రాఘవులు చిత్రపటానికి ఎస్‌కె వలీ పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రాఘవులుపై రాసిన విప్లవ గీతాన్ని కళారూపంగా డప్పు వాయిద్యాలతో ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ మంచి కళాకారుడు, కల్మషం లేని మంచి మనిషి రాఘవులుకు ఈ సంస్మరణ సభలో అరుదైన



రాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

గౌరవం లభించిందన్నారు. ఆయన లేని లోటు సిపిఎం పార్టీకి, కళారంగానికి తీరని లోటు అన్నారు. రాఘవులు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన భావజాలాలను నిరంతరం స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధన కోసం సిపిఎం నిష్పక్షపాతంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు ఎన్.సాయి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీను, మామిడి శెట్టి రామాంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు గుత్తుల రంగారావు, మచ్చ సుబ్బారావు, కుసుమే జయరాజు, గెద్దాడ వెంకట్రావు, మానుకొండ వీర్రాజు, కారుపల్లి రాజు, కేతా నాగ ఆంజనేయులు, దేవాబత్తుల రాధాకృష్ణ, ప్రసాద్, బొర్రా ధర్మారావు, దేవదానం, గోపాలకృష్ణ, చదలవాడ కృపావరం, జోగి వెంకట సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో చెత్త తొలగించాలి

పెనుమంత్ర:మండలంలోని వెలగలేరు - సత్యవరం రోడ్డులో డంపింగ్ చెత్త వల్ల ఇబ్బంది నేపథ్యంలో వెంటనే తొలగించాలని ప్రజలు, ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సత్యవరంలో శ్మశానవాటిక పూర్వం నుంచి వెలగలేరు గ్రామస్తులు వాడుకుంటున్నారని, అయితే నాలుగైదు సంవత్సరాలుగా శ్మశానవాటికలో చెత్త వేసి దాన్ని డంపింగ్ యార్డుగా మార్చేశారని తెలిపారు. సత్యవరం నుంచి మార్టేరు వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారిలో చెత్త వేయడం వల్ల విపరీతమైన దుర్గంధం వస్తోందని, చెత్త డంపింగ్ వల్ల విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని, గతంలో వెలగలేరు పంచాయతీకి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. దీన్ని కేవలం శ్మశానవాటికగా మాత్రమే వినియోగించాలని కోరుతున్నామని తెలిపారు. సోమవారం కలెక్టర్‌లో కూడా వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వైసిపి గ్రామ అధ్యక్షులు తమనంపూడి పల్లారెడ్డి, ఎంపిటిసి గెడ్డం ఈశ్వర్, తమనంపూడి శ్రీనివాస్ బంగార్రెడ్డి, పాల శ్రీను, దొంగ గోవిందు, దొంగ శ్రీనివాస్, తమనంపూడి సూర్యారెడ్డి, కుక్కల వెంకటరత్నం, వీరవల్లి స్వామి, శరన్‌రెడ్డి ఉన్నారు.

సర్వేలు బాధ్యతతో చేయాలి : డిఎల్‌డిఒ

ఆచంట:సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, ఇతర కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని, నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే చర్యలు తీసుకుంటామని నరసాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి జి.రాణి అన్నారు. బుధవారం ఆచంట గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలో నిర్వహిస్తున్న వివిధ సర్వేల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని డిఎల్‌డిఒ దృష్టికి తీసుకురాగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్, ఎఒ వి.పూర్ణ బాబ్జీ, డిప్యూటీ ఎంపిడిఒ బులి సూరన్న, సీనియర్ అసిస్టెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఇఒ వీరాస్వామి, హెచ్‌ఎం రాయపూడికి పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ స్కూల్ హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్‌కు, ఎంఇఒ గుమ్మళ్ల వీరస్వామికి పారాచుట్ వరల్డ్ రికార్డు వారు అంతర్జాతీయ పర్యావరణ పురస్కారం-2025 ఆన్‌లైన్ ద్వారా పంపించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, మట్టి విగ్రహాల తయారీకి విద్యార్థులను ప్రోత్సహించుట, ప్లాస్టిక్ వంటి అంశాల్లో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డులను సంస్థ చీఫ్ దాసరి స్వప్న మెయిల్ ద్వారా అందజేశారు. పురస్కార గ్రహీతలను మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు.

బధిరుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక

భీమవరం టౌన్:బధిరుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏలూరులో జరిగిందని జిల్లా వైస్ ప్రెసిడెంట్ గని శెట్టి శివ సత్య శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఒకటే సంఘం ఉండేదని, ప్రస్తుతం ఏ జిల్లాకు ఆ జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగిందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.ఉమామహేష్, ఉపాధ్యక్షుడిగా గనిశెట్టి శివ సత్య శ్రీనివాస్, వి.భాను అరవింద్, మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్.జన్ని, జనరల్ సెక్రటరీగా టి.రాము, జాయింట్ సెక్రటరీగా కె.వరప్రసాద్, ట్రెజరర్‌గా, వై.దుర్గ వెంకట్ అఖిల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ కార్యవర్గం కృషి చేస్తుందని, అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలపై పోరాడతామని అన్నారు.

స్వర్ణాంధ్రలో మెగా రక్తదాన శిబిరం

నరసాపురం:మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో అమృత్ మహోత్సవం 2.0 కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మెగా రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. సుమారు వంద మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఏలూరు బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు ఏడాదిలో కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గోపీచంద్, స్వామినాథన్, మాణిక్యాలరావు పాల్గొన్నారు

రొయ్యల చెరువులను పరిశీలించిన బృందం

కాళ్ల:వ్యాధుల వ్యాప్తిని పర్యవేక్షించడం, నియంత్రించడం కోసం నిఘా కార్యక్రమం ప్రభావవంతమైన ఆరోగ్య నిర్వహణకు, చివరికి స్థిరమైన ఆక్వాకల్చర్‌కు ప్రాథమిక అవసరంగా మారిందని స్పాడ్ టీమ్ కన్సిట్యూటడ్ పి దత్తాత్రేయ పేర్కొన్నారు. ఎస్ ఐ ఎఫ్ టి ఆధర్యం లో అమలవుతున్న నేషనల్ సర్వేలెన్స్ ప్రోగ్రాం ఫర్ ఆక్వాటిక్ అనిమల్ డిసీస్ ఫేజ్ -2 లో భాగంగా కోనలపల్లి రెవెన్యూ గ్రామంలో కోమటిగుంటలో రొయ్యల చెరువును కాకినాడ నుంచి జాతీయ జల జంతువుల వ్యాధుల నిఘా బృందం బుధవారం పరిశీలించింది. రొయ్యలకు వైబ్రియావైరస్ వ్యాధులు సోకడంతో రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రొయ్యలను పరిశీలించారు. ప్రొఫెసర్ కె.శివరాం, కన్సల్టెంట్ పి.శ్రీనివాస్, మండల మత్స్యశాఖ అధికారి ఇందిరా ప్రియదర్శిని, రైతు బాబ్జి పాల్గొన్నారు.

పాలకొల్లులో ఇంజినీరింగ్ కళాశాల కోసం వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజుకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వంద సంవత్సరాల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడిన పాలకొల్లు పట్టణ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంఘం నేత కోరాడ సుబ్బారావు పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకంతో ఆరోగ్యం, ఆదాయం

ఉండి:మిద్దె తోటల పెంపకంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో పాటు అధిక ఆదాయం పొందొచ్చని మిద్దె తోటల పెంపకం నిపుణులు వేణుగోపాలరావు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ దిబోరా మిషియానా అధ్యక్షతన నిర్వహించిన మిద్దె తోటల పెంపకం శిక్షణ కార్యక్రమంలో వేణుగోపాలరావు మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మిద్దె తోటల పెంపకం అనివార్యమైందన్నారు. బహిరంగ మార్కెట్లో లభించే కూరగాయలు రసాయనాలతో కూడుకున్నవని, దీని వల్ల అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మిద్దె తోటల పెంపకం వైపు దృష్టి సారిస్తున్నారన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ మిద్దె తోటల పెంపకంతో పాటు మిద్దె తోటలో తేనెటీగలు ఏ విధంగా పెంచాలనే అంశాలు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో నేర్పుతున్నామని తెలిపారు. అనంతరం వేణుగోపాలరావు దంపతులను సత్కరించి శిక్షణకు హాజరైన మహిళలకు, రైతులకు మొక్కలు ఉచితంగా అందజేసి ఫీల్డ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పి.వినయలక్ష్మి, ఎ.శ్రీనివాస్, బిందు ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

గణపవరం:గణపవరం నాలుగో సచివాలయంలో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోషణ పోగ్రాం నెలరోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, స్థానికులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే : ఎంఎల్‌ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వచ్ఛోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ సెంటర్ నుండి ట్రాఫిక్ ఐలాండ్ వరకూ నిర్వహించే ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ఏడు రోజులపాటు జరిగే స్వచ్ఛతహి కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెనుగొండలో సిఐటియు 13వ జిల్లా మహాసభ

వచ్చే నెల 28, 29 తేదీల్లో నిర్వహణ

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

వచ్చే నెల 28, 29 తేదీల్లో సిఐటియు 13వ జిల్లా మహాసభ పెనుగొండలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సిఐటియు జిల్లా విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్



మాట్లాడుతున్న రాజా రామ్మోహన్ రాయ్

మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యలపై సిఐటియు అలుపెరగని ఆందోళనలు, పోరాటాలు చేస్తుందన్నారు. వేతనాలు, అగ్రిమెంట్లు ఇతర సౌకర్యాలపై మండల, జిల్లాస్థాయిలోనూ ఆందోళన, పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టి కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా సమ్మెతోపాటు ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఆందోళనలు చేపట్టామన్నారు. కార్మికులు, ఉద్యోగులకు వట్టి మాటలు చెప్పి కార్పొరేట్లకు అనుకూల నిర్ణయాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించే ప్రయత్నం చేస్తుంటే అదేమీ తెలియనట్లుగా రాష్ట్ర పాలకులు నిద్ర నటిస్తున్నారన్నారు. జిల్లాలోని కార్మిక సమస్యలపై మహాసభలో చర్చించి రానున్న కాలంలో జిల్లాలో ఉద్యోగ, కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అనంతరం వివిధ మండలాల నుంచి హాజరైన నేతలు మాట్లాడారు. సమావేశంలో బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, ఎం.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, ఝాన్సీ, కళ్యాణి, అజయకుమారి, త్రిమూర్తులు, రంగారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం శక్తివంతంగా ఉంటుందనే భావనతో కేంద్ర ప్రభుత్వం స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహిళల ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో రక్త నిధిని ఏర్పాటు చేస్తున్నామని, అక్టోబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిపాల్ మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు పీటర్, అరుణ, విజయలక్ష్మి, కీర్తి, రమ్య, శృతి, చైతన్య కిరణ్ పాల్గొన్నారు.

ఆచంట : మహిళలు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. సామూహిక హెల్త్ సెంటర్లో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడారు. ఎంపిడిఒ బిఎస్ఎస్ కృష్ణమోహన్, తహశీల్దార్ జి.కనకరాజు, ఆసుపత్రి అభివృద్ధి అధికారి శివరంజని, పాల్గొన్నారు.

తణుకు : ప్రతి ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబ సభ్యులతోపాటు సమాజం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్వస్తి నారీ సశక్త్ పరివార్ అభియాను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. ఎంఎల్ఎ మాట్లాడారు. ఆసుపత్రి ఆవరణలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభించి గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం ఆసుపత్రిలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, సాయి బాలాజీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాళ్ల:మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపర్చాలన్న లక్ష్యంతో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బుధవారం నుంచి లాంఛనంగా ప్రారంభించినట్లు డాక్టర్ సిహెచ్.రంగనాయుడు తెలిపారు. ప్రధాని మోడీ మధ్యప్రదేశ్‌లో ప్రారంభోత్సవం చేయగా మండల స్థాయి అధికారులు టెలివిజన్ ద్వారా ఆన్‌లైన్‌లో వీక్షించారు. ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, పెన్మెత్స విశ్వనాథరాజు, ఎంపిటిసి సభ్యులు సత్యవతి, కోలనపల్లి సర్పంచి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం పిహెచ్‌సిలో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపిపి వీరవల్లి దుర్గా భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలు అనగా వారికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలున, రక్తహీనత, మధుమేహం, బిపి, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయబడతాయని తెలిపారు. మందులు కూడా ఉచితంగా ఇవ్వబడతాయన్నారు. సర్పంచి చికెలే మంగతాయారు, తహశీల్దార్ రామాంజనేయులు, ఎంపిడిఒ అప్పారావు, వైద్యాధికారి డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పాల్గొని మాట్లాడారు. మహిళల ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుందన్నారు. ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, పోలిశెట్టి నళిని, అరుణ పాల్గొన్నారు.

మొగల్తూరు : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరు పిహెచ్‌సిలో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించి ఆయన మాట్లాడారు. వైద్యులు కె.లక్ష్మీపార్వతి, తహశీల్దార్ రాజకిశోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి పాల్గొన్నారు.

రైతులకు ఎలుకల మందు పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితే అధిక దిగుబడులు పొందొచ్చని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మొగల్తూరులోని ఎలుకల నివారణ మందును తయారీ చేసి రైతులకు అందించారు. ఎలుకల బొరియల వద్ద నివారణ మందు ఉంచారు. ఆమె మాట్లాడారు. ఎఒ అబ్దుల్ రహీం, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందు పిచికారీ

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతికతో రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ నరసాపురం డివిజన్ ఇన్‌ఛార్జి ఎ.నరసింహారావు అన్నారు. బుధవారం మొగల్తూరులోని డ్రోన్‌తో 15 మంది రైతులకు చెందిన 25 ఎకరాలకు సామూహికంగా మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 12 రకాల బ్యాక్టీరియాలు కలిపి పిచికారీ చేయడం వల్ల పంట పెరుగుదల బాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.మహాలక్ష్మి, ఎం.దుర్గ భవాని. జి.కనక దుర్గాభవాని, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 21 రోజులు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకూ 21 రోజులు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం - దీక్షారంభ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులకు అటానమస్ కళాశాలకు ఉండే సౌకర్యాలు అవకాశాలు గురించి వివరించారు. ఈ 21 రోజులు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు, ఎన్ఇపి 2020, ఈ లెర్నింగ్ రిసోర్సెస్, బెస్ట్ ప్రాక్టీసెస్, అన్ని రకాల సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులు సమగ్రంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకాడమిక్ కోఆర్డినేటర్ వి.యామిని, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ సిహెచ్ ఉషారాణి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందజేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయాలని జిల్లా ఎస్‌సి సాంఘిక సంక్షేమ, సాధికారిక అధికారి ఎన్‌వి.అరుణకుమారి తెలిపారు. స్థానిక వైఎన్ కళాశాలలో ఎన్‌వి.అరుణకుమారి అధ్యక్షతన కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రావాల్సిన ఫీజు బకాయిల కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, అందుకోసమే ఈ ఐదు మండలాలలో ఉన్న ప్రిన్సిపల్స్ అందరూ తగు రీతిలో వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో నరసాపురం సాంఘిక సంక్షేమ అధికారిని కె.బాలుసాధన, వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ పి.శాంతి పాల్గొన్నారు.